# టీ కప్పులో బుజ్జులు

## సంపరజ్యోతి

**'నా** బాల్యంలో బాల్యం లేదు' అన్నాడో రష్యన్ మహా రచయిత. భారత దేశంలో బాల్యం టీ కొట్లలో, టిఫిన్ అంగళ్ళలో నలిగిపోతూనే వుంది. అలాంటి ఓ బుజ్జులుగాడి కన్నీటి కథ!

''పొద్దు బారెడెక్కినా మెలకువ రాలేదు కాబోలు – దొంగ నా కొడకా.. నీకు సుప్రభాతాలు పాడితేగాని నిద్రలేవవా?...''

**గో**విందరాజులు కోపంతో విసిరిన కాలు డొక్కలో తగిలి బిత్తరపోయి మేలుకున్న బుజ్జులు పడుతూ లేస్తూ కిందికి పరుగుదీశాడు. అలాగాకుండా ఇంకా అక్కడే ఉంటే బూతుల అష్టోత్తరాలు, సహస్రనామాలతో పాటు బెల్టుతోటో లేక చెప్పుతోటో దేహశుద్ధి తప్పదని వాడికి అనుభవం నేర్పిన పాఠం.

కింద నీళ్ళ గోలెం దగ్గర ఆదరాబాదరా ముఖం కడుక్కొని - దోసిట్లోకి నీళ్ళు తీసి నోట్లో పోసుకొని పుక్కిలించాడు. మాసికలు పట్టిన చొక్కాతోటే మొహం తుడుచుకున్నాడు.

అప్పటికే ఎంగిలి ప్లేట్లు, గ్లాసులూ బుజ్జులు కోసం ఎదురు చూస్తున్నట్టు గుట్టగా పడి ఉన్నాయి. కంగారుగా ఓ పది ప్లేట్లూ, గ్లాసులూ కడిగి వంట గదిలోకి తీసుకెళ్ళాడు.

వంట మేస్టర్ నాయర్ ఒక చేత్తో బీడీ కాలుస్తూనే, రెండో చేత్తో ఇడ్లీలు వాయి దింపుతున్నాడు.

''ఒరేయ్ బుజ్జులూ - ఇట్రా, ఇంద ఇడ్లీలు తిను'' - మూడు ఇడ్లీలు ప్లేట్లో వేసి చట్నీ, సాంబారు పోసి ఇచ్చాడు.

వేడి వేడి ఇడ్లీలు తిని ఎంత కాలమైందో - చిన్నప్పుడు అమ్మ మినప రొట్టె చేస్తే దాన్ని వేడి వేడిగా ఆవకాయతోటో లేక కారప్పొడితోనో నంజుకుని తింటుంటే భలే ఉండేది.

బుజ్జులుకి మళ్ళీ గతం గుర్తుకొచ్చింది.

నీళ్ళ గోలెం దగ్గర కూర్చుని ఇడ్లీ ముక్క తుంపుకుని నోట్లో పెట్టుకున్నాడో లేదో - వీపు మీద ఎర్రగా కాల్చిన ఇనుప చువ్వతో వాత పెట్టినట్టు చుర్రున మంట మండింది.

చేతిలో పచ్చి వెదురు కర్రతో యమదూతలా నిలుచుని ఉన్నాడు గోవిందరాజులు.

''తెల్లారిందా తింటానికి - ఎక్కడి అంట గిన్నెలు అక్కడే పడుండాయి - దొరగారు తాపీగా టిఫిన్ తింటున్నారు... నా కొడకా - కాకినాడ పేసింజరొచ్చే టైమయింది. గిన్నెలు కడగడం మాని ఇడ్లీలు తింటుండావా? ... గిన్నెలు ఎవరు కడుగుతారు బే? నీ అబ్బనా? ...''

తింటున్న ఇడ్లీలు పక్కన పెట్టి మళ్ళీ గిన్నెలు కడగడంలో మునిగిపోయాడు.

ఏ పసివాడి నుంచి పనిని ఏ పద్ధతిలో రాబట్టుకోవాలనేది గోవిందరాజులుకి వెన్నతో పెట్టిన విద్య.

గోవిందరాజులు విషయానికొస్తే -

గోవిందరాజులుకి తన తల్లీ తండ్రీ ఎవరో తెలియదు. తనది ఏవూరో అతడికి అంతకన్నా తెలియదు. ప్లాట్‌ఫారం మీద మొదలైన బతుకు, ఈ రోజు ఒక కాకా హోటల్ ఓనర్ లెవెల్‌కి ఎదిగింది.

అతడికింకా పెళ్ళి కాలేదు. దాని గురించి అతడు ఆలోచించినట్టు కూడా కనబడడు. ఆటవిక న్యాయంలో ఆరితేరిన కరుడుకట్టిన స్వార్థపరుడు - ఇదీ క్లుప్తంగా గోవిందరాజులు చరిత్ర.

తలవంచుకుని మౌనంగా గిన్నెలు కడుగుతున్నాడు బుజ్జులు. ఇడ్లీలు చల్లారిపోయి ఈగలు ముసురుతున్నాయి. ఇందాక తగిలిన దెబ్బకి వీపు ఇంకా మంట పుడుతూనే ఉంది. చొక్కా కింది ఎర్రటి చర్మం మీద గులాబీ రంగులో వాత తట్టు తేలింది. కళ్ళల్లో సుడులు తిరుగుతున్న కన్నీటిని చొక్కా భుజాలకు తుడుచుకుంటున్నాడు.

ఎందుకో బుజ్జులుకి ఒక్కసారిగా అమ్మ గుర్తుకు వచ్చింది. ఎంత ప్రేమగా చూసుకునేది... అమ్మ జ్ఞాపకానికి రాగానే బుజ్జులుకి కన్నీళ్ళు ఆగలేదు.

బుజ్జులు అసలు పేరు సుభాష్ చంద్రబోస్ - గోదావరి జిల్లాలోని ఒక పల్లెటూరు బుజ్జులు స్వగ్రామం. ఆ ఊళ్ళో ఒక హైస్కూలు కూడా ఉంది. బుజ్జులు తండ్రి నారాయణ ఆ స్కూల్లోనే ప్యూన్‌గా పనిచేసే వాడు. రోజూ హైస్కూలు ఆఫీసు గదిలో ఠీవిగా మిలిటరీ దుస్తుల్లో నిలబడిన సుభాష్ చంద్ర బోస్ నిలువెత్తు ఫోటో చూసుకుంటూ - తన కొడుకు కూడా అంతటి వాడు కావాలని కలలు కంటూ కోరికోరి ఆ పేరు పెట్టాడు బుజ్జులుకి.

నారాయణ భార్య పద్మావతి హెడ్ మాస్టారి ఇంట్లోనే కాక ఇంకా నాలుగైదు ఇళ్ళల్లో పాచి పనులు చేస్తూ గుట్టుగా సంసారం నడుపుకొచ్చేది.

ముగ్గురు ఆడపిల్లల తరువాత ఆఖరున పుట్టాడు బుజ్జులు. అందుకే వాడిని అపురూపంగా చూసుకొనేది తల్లి.

బుజ్జులు చిన్నతనం నుంచే ముద్దుగా బొద్దుగా అందంగా ఉండేవాడు. అందుకే ఇంట్లో వాళ్ళతో పాటు ఊళ్ళో వాళ్ళు కూడా వాడిని ముద్దుగా 'బుజ్జులు' అనే పిలవడంతో వాడికి అదే పేరు స్థిరపడిపోయింది.

హెడ్మాస్టర్‌గారి పిల్లలు బుజ్జులుకి ఇంగ్లీష్ రైమ్స్ నేర్పించడంతో పాటు వాణ్ణి బాగా చదివించమని ప్రోత్సహించి పట్టుబట్టడంతో - ఆ ఊళ్ళోనే వెలి




సిన ఓ కాన్వెంట్ స్కూల్లో విద్యార్థి అయిపో యాడు.

ముగ్గురు ఆడపిల్లల తరువాత పుట్టిన మొగ నలుసు కావటాన కాస్త గారాబం ఎక్కువే.

తోమిన గిన్నెలూ, ప్లేట్లూ నీళ్ళల్లో కడిగి కిచెన్‌లో పెట్టి వచ్చేసరికి మళ్ళీ ప్లేట్లూ, గ్లాసులూ సిద్ధంగా ఉన్నాయి. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ కావడాన ప్రయాణీకుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది.

కౌంటర్ దగ్గర కూర్చున్న గోవిందరాజులు ఎవరిమీదో అరుస్తున్నాడు.

గిన్నెలు కడగడం వల్ల నీళ్ళల్లో నానిన చేతులు పాచిపోయి అసహ్యంగా ఉన్నాయి. వేసుకున్న చొక్కా, నిక్కరు మాసికలు పట్టి మురికితో అట్టలు కట్టి ఛండాలంగా ఉన్నాయి. తైల సంస్కారం లేక జుట్టు ఎర్రగా పీచు రేగిన తాటి టెంకలా ఉంది. ఎప్పుడూ మురికి నీటిలో నానడం పైగా చెప్పులు కూడా లేకపోవడాన కాళ్ళు పాచి - పగిలి - మంటలు




పుడుతున్నాయి.

చల్లారిపోయిన ఇడ్లీలపై ముసురుకుంటున్న ఈగల్ని తోలుకుంటూ టిఫిన్ తిన్నాడు.

ప్రొద్దుట ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ వంచిన నడుం ఎత్తకుండా పని చేస్తే రెండు నుంచి నాల్గుగంటల వరకూ రెస్టు. మళ్ళా నాల్గుగంటల నుంచి రాత్రి పదిన్నర వరకూ చాకిరీ చేస్తే - రెండు పూటలా భోజనం, ప్రొద్దుట టిఫిన్‌తో నెలకు నూట యాభై రూపాయలిస్తాడు గోవిందరాజులు.

డిసెంబరు నెల కావడంతో పొద్దు మీదికెక్కినా ఇంకా చలిగాలి ఎముకల్ని కొరుకుతూనే ఉంది.

గోవిందరాజుల్ని రేపు డబ్బు అడిగి వేరే చొక్కా, లాగూ కొనుక్కోవాలి - మనసులోనే అనుకొన్నాడు బుజ్జులు.

కొత్త గుడ్డల గురించి ఆలోచన రాగానే దుఃఖం ఆగలేదు. ఆ గుడ్డలే తనను ఈ స్థితికి తెచ్చాయి.

అమ్మా, అక్కయ్యా తన గురించి ఎంత బెంగ పెట్టుకున్నారో- నాన్నకి నా మీద అస్సలు ప్రేమ లేదు - లేకుంటే పక్కన తన స్నేహితులున్నారని కూడా ఆలోచించకుండా తనను అంత అవమానించడు -

అయినా ఆయన మాత్రం ఏం చేస్తాడు! తప్పంతా నాదే - నాన్నను అనవసరంగా అనుకోకూడదు. నాన్న ఏం చెప్పినా - ఏం చేసినా నా కోసమే కదా! -

చెయ్యి చేసుకునే బదులు నోటితో చెప్పి ఉండొచ్చు కదా - కనీసం నా స్నేహితులు వెళ్ళిపోయిన తరువాత కొట్టినా అంత బాధ పడకపోదును కదా -

దాదాపు ఏడెనిమిది నెలల క్రితం జరిగిన సంఘటన చిన్నదే అయినా బుజ్జులు జీవితాన్ని చాలా దారుణంగా మలుపు తిప్పింది.

శ్రీరామ నవమికని ఎంతో కష్టపడి డబ్బులు కూడబెట్టి - కనీసం ఆయన కోసం ఒక చొక్కా కూడా కొనుక్కోని నాన్న - తన కోసం కొత్త బట్టలు కుట్టించాడు.

అమ్మ - ''వొద్దురా నాన్నా! మీ నాన్న చూస్తే కోప్పడతారు'' అంటున్నా వినకుండా హోలీ పండగ రోజునే వేసుకొని స్నేహితులతో మ్యాట్నీ సినిమాకు వెళ్ళాడు. ఇంటికి తిరిగి వచ్చే సరికి బట్టలు మురికితో, రంగులతో సర్వనాశనం అయిపోయాయి. అప్పుడుగానీ తెలియలేదు ప్రొద్దుట అమ్మ ఎందుకు వేసుకోవద్దని చెప్పిందో -

అప్పటికే ఇంటికి చేరిన నారాయణ బుజ్జుల్నీ, రంగులంటి పాడయిపోయిన బట్టల్నీ చూసి ఉద్రేకంతో ఊగిపోయాడు. ఎక్కడ తగుల్తోందన్నది కూడా చూడకుండా బెల్టుతో కొట్టాడు.

- అప్పుడే బుజ్జులు పదో తరగతి పరీక్షలు రాశాడు.

మూతి మీద అప్పుడప్పుడే నూనూగు మీసాలు వస్తున్నాయి - స్నేహితుల ముందు తండ్రి తనను అలా కొట్టడం గొప్ప అవమానంగా భావించాడు. ఫలితంగా ఆ రాత్రే - ఇంటిలో ఎవరికీ చెప్పకుండా పరారయ్యాడు.

ఒక గమ్యం లేదు - ఆ ప్రయాణానికి అంతం లేదు -


ఎక్కడెక్కడో తిరిగాడు. రైళ్ళలో టిక్కెట్ లేకుండా చేసిన ప్రయాణాలకు టీసీల చేత తన్నులూ, చీవాట్లూ తిన్నాడు.

ఆకలి తీర్చుకోడానికి ఏవేవో పనులు చేశాడు - కొన్నాళ్ళు పస్తులు పడుకొని వీధి కొళాయిలోని నీటితోటే కడుపు నింపుకున్నాడు.

ఇప్పుడు గోవిందరాజులు హోటల్లో కప్పులు కడిగే పనిలో చేరాక తిండి లోటు లేకుండా రోజు గడిచిపోతోంది.

వచ్చిన కొత్తల్లో ఇంటికి వెళ్ళి పోవాలని అనిపించినా అహంకారం ఆపుచేసింది. అదీకాక తండ్రి ఏమంటాడో అనే భయం కూడా ఒక కారణమయింది. రెండు నెలల క్రితం ఇంటికి ఉత్తరం రాస్తే తిరిగి జవాబు రాలేదు.

తనను అక్కరలేదని వదిలేసుకున్నాక తానెందుకు వెళ్ళాలి? తను కూడా వెళ్ళే ప్రయత్నంగానీ - మళ్ళీ ఉత్తరం రాసే ప్రయత్నం గానీ చెయ్యలేదు - అదే అతడు చేసిన తప్పు, ఆ పొరపాటుకు ఎంత పెద్ద మూల్యం చెల్లించబోతున్నాడన్నది అప్పుడతడికి



తెలియలేదు.

అప్పుడప్పుడు గతంలోని అమ్మ ప్రేమా, అక్కయ్యల ఆప్యాయతా, తండ్రి ఆచరణా గుర్తుకు వచ్చి తనలో తానే కుమిలి కుమిలి ఏడ్చుకునేవాడు.


ఇంటి నుంచి వచ్చేశాక తన మీది బెంగతో తండ్రి మంచంపట్టి మరణించిన సంగతిగానీ, తండ్రి మరణానంతరం మేనమామ తన తల్లినీ అక్కయ్యలను తనతో వెంట బెట్టుకొని దూరంగా తీసుకొనిపోయిన విషయం గానీ బుజ్జులుకి తెలియదు - తెలిసే అవకాశం కూడా లేదు.

తను రాసిన ఉత్తరం వాళ్ళకి అందలేదన్న విషయం తెలియక - వాళ్ళకి ఇంకా తన మీద ద్వేషమే ఉందన్న అపోహలోనే ఉన్నాడు -

అప్పుడు సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలవుతోంది. రైల్వే స్టేషన్ కూడా ఖాళీగానే ఉంది. హోటల్లో రద్దీ తగ్గి ఒకరిద్దరు కస్టమర్ల కన్నా ఎక్కువ లేరు.

కౌంటర్ దగ్గర కూర్చొని కూడబలుక్కుంటూ పేపరు చదువుతున్న గోవిందరాజులి దృష్టి - పేపర్లో ఒక మూలపడిన ''కనిపించుట లేదు'' - అన్న ప్రకటన మీద పడింది. ఆ ప్రకటనలో వేసిన ఫోటో బుజ్జులుదే! ఆ ప్రకటన ఇచ్చింది బుజ్జులు మేనమామ. దాన్ని చదువుతుండగానే గోవిందరాజులు మొహంలో రకరకాల రంగులు మారాయి. అతడి మెదడు కంప్యూటర్ కంటే వేగంగా అనేక రకాలుగా లాభనష్టాల్ని బేరీజు వేసింది.

గోవిందరాజులు పేపరు మడిచి కౌంటరు సొరుగులో ఉంచి తాళం వేసి బయటకు వెళ్ళాడు. స్టేషను




బయట ఫుట్‌పాత్ మీదున్న సెకండ్ హేండ్ బట్టలు బుజ్జులు సైజువి ఒక జత తీసుకొని తిరిగొచ్చాడు.

హోటల్ వెనకాల నీళ్ళ గోలెం పక్కన కూర్చున్న బుజ్జుల్ని చూసి నవ్వాడు.

మళ్ళీ ఏ ఉపద్రవం ముంచుకు రాబోతోందోనని బుజ్జులు చిన్ని గుండె గుబగుబలాడింది. దిగులుగా దీనంగా చూశాడు గోవిందరాజులు వంక.

''ఏరా! స్నానం చేశావా?'' -

''ఇంకా లేదు - రెండు గంటలకి డ్యూటీ దిగి చేస్తాను -''

''సరేలే! ఇప్పటిదాకా చేసిన డ్యూటీ చాలు - స్నానం చేసి ఈ బట్టలు తొడుక్కో - ఎప్పుడైనా నీ బట్టలు చూసుకున్నావా? ఎంత మాసిపోయినాయో - ఇంక ఈ వేళకి నీ పని చాలించుకో - ఈ రోజు నీకు సెలవు - హాయిగా మేడమీదకి పోయి పడుకో, సెకండ్ షో సినిమాకి పంపుతాలే - చూసొచ్చి మళ్ళీ పొద్దుటే పనికి లేవాల -''

బుజ్జులుకి ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. ఎదురుగా ఉన్నది గోవిందరాజులేనా! అని అనుమానం కలిగింది. కలయో, నిజమో, వైష్ణవ మాయో - అన్నట్టుంది వాడి పరిస్థితి.

ఆ క్షణంలో బుజ్జులు కళ్ళకి తనే స్వయంగా దిగి వచ్చి అడక్కుండానే వరాలిస్తున్న భగవంతుడిలా కనిపించాడు గోవిందరాజులు.

ఆ ప్రకటన ప్రభావం ఆ ఒక్కరోజే ఉంటుందని, మర్నాటికి ఎవరికీ ఆ ప్రకటన గానీ, దాన్లోని ఫోటోగానీ జ్ఞాపకం ఉండదన్న సంగతి గోవిందరాజులు ఊహించాడు. అందుకే ఆ రోజు మొత్తం బుజ్జులు బయటకు కనపడకుండా ఉండేలా పథకం వేశాడు -

అవును మరి - బుజ్జులు లాంటి పనివాడు, కొట్టినా, తిట్టినా లొంగి పడుండే వాడు మళ్ళీ దొరకాలంటే కష్టం కదా! అదీగాక బుజ్జులు మంచి నమ్మకస్తుడు కూడా -

ఇవేవీ తెలియని బుజ్జులు, స్నానంచేసి - గోవిందరాజులు తెచ్చిన బట్టలు కట్టుకొని మేడ మీది మురికి గదిలో ముడుచుకొని, ఆదమరిచి హాయిగా నిద్రపోతున్నాడు.

ఆ ప్రకటన పడిన పేపరు పకోడీల పొట్లంగా మారి, బుజ్జులు తల్లి హృదయంలా నలిగిపోతోంది.

